క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంరోడ్డులోని ఎస్ భవనంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం వైద్యశిబిరం జరుపుతున్న విషయం తెలిసిందే. తొలుత సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. కోవిడ్–19 గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలనీ, వ్యక్తికి, వ్యక్తికి మధ్య దూరం పాటించాలని సూచించారు. అనంతరం బీపీ, షుగరు పరీక్షలతోపాటు అవసరమైన వారికి థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించారు. అల్పాహారం అందించి, తిరిగి పరీక్షలు చేశారు. అవసరమైన మందులను నెలకు సరిపడా అందజేశారు. మొత్తం 300 మందికి పరీక్షలు చేశారు. డాక్టర్ శారదతోపాటు డాక్టర్ చందన, దీప్తి, 20 మంది వలంటీర్లు సేవలను అందించారు.

కాల్వల మరమ్మతులకు శ్రీకారం



తెనాలిటౌన్: ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే కాల్వల మరమ్మతులు ప్రారంభించినట్లు తెనాలి ఇరిగేషన్ ఏఈ సీహెచ్ శివరామకృష్ణ తెలిపారు. దుగ్గిరాల బస్టాండ్ వద్ద నుంచి కూచిపూడి లాకుల వరకు ఉన్న కాల్వలు తెనాలి ఇరిగేషన్ కార్యాలయ పరిధిలో ఉన్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి తూర్పు కాల్వ మరమ్మతులు ప్రారంభం కాగా శనివారం నుంచి పడమల కాల్వ(మధ్య) మరమ్మతులు ప్రారంభమైనట్లు తెలిపారు. రూరల్ మండలం కఠెవరం వద్ద కాల్వ కట్ట పనులు జరుగుతున్నట్లు వివరించారు. ఖరీఫ్ ప్రారంభమయ్యేనాటికి కాల్వలను పూర్తిగా శుభ్రం చేసి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు.

సీనియర్ సిటిజన్ కార్డులపై అవగాహన



తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కైలాస్‌నాథ్, ఏపీ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యూవీవీ రత్నసాగర్, రాష్ట్ర కోశాధికారి ఏఎం ఉమామహేశ్వరరావు అతిథులుగా హాజరయ్యారు. సీనియర్ సిటిజన్లకు అవసరమైన సీనియర్ సిటిజన్ కార్డు, ఏబీహెచ్‌ఏ కార్డు, ఈహెచ్‌ఎస్ కార్డు గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, డాక్టర్ నర్రావుల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి పుచ్చకాయల కోటిరెడ్డి, కార్యవర్గసభ్యులు అబ్బూరు రామమూర్తి, అజ్గర్ ఆలీ, గుమ్మడి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేసిన అహల్యభాయి



తెనాలిటౌన్: మహిళా సాధికారతకు నడుం కట్టిన మహనీయురాలు అహల్యభాయి హోల్కర్ సేవలు నిరుపమానమని బీజేపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కఠారి వాసుదేవనాయుడు పేర్కొన్నారు. రూరల్ మండలం చావావారిపాలెంలో ఆదివారం పుణ్యశ్లోక అహల్యభాయ్ హోల్కర్ 300వ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీజేపీ మండల ప్రెసిడెంట్ కడియాల నందకిషోర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కె.వాసుదేవనాయుడు పాల్గొని మాట్లాడారు. పెద్దింటి గాన కళావతి అహల్యభాయ్ హైందవ ధర్మానికి చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. అన్నసత్రాల నిర్వహణ, దేవాలయాల పునఃరుద్ధరణ, మహిళా సాధికారత వంటి విషయాల్లో ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టి.అనంతాచార్యులు, ఎం.జనార్ధన్, ఎం.వీరయ్య, బి.సాంబశివరావు, పద్మావతి, పలువురు బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

అద్దెగోలు నిబంధనలు!

- రూ.కోట్ల విలువైన ఆర్టీసీ స్థలం నిరుపయోగం
- లీజుకివ్వాలని నిర్ణయించినా ప్రతిబంధకంగా అద్దె నిబంధన
- స్థలం విలువలో కనీసం 0.2 శాతం అద్దె ఉండాలంటున్న ఆర్టీసీ
- గిట్టుబాటు కాదంటూ ముందుకు రాని వ్యాపారులు
- ప్రస్తుతం పిలిచిన టెండరుకు ఈనెల 29వ తేదీ తుదిగడువు

ఆదాయం రాక అవస్థలు



రామలింగేశ్వరపేటలోని ఆర్టీసీ పాత డిపో స్థలం

తెనాలి: ఏపీఎస్ ఆర్టీసీకి తెనాలి డిపోలో విలువైన ఖాళీస్థలం ఉంది. లీజుకిస్తే ఆర్టీసీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆ స్థలానికి లీజు అవకాశం దక్కనేలేదు. దాదాపు అయిదు దశాబ్దాలుగా ఖాళీగానే ఉంటోంది. లీజు నిబంధనలను ఆర్టీసీ సరళతరం చేయటం లేదు. భారీ లీజు మొత్తాన్ని, వచ్చే ఆదాయాన్ని లెక్కించుకునే వ్యాపారులు ఎవరూ అటుకేసి చూడటం లేదు. ఈనెలాఖరుతో ముగియనున్న టెండర్ల గడువులోనైనా ఈ స్థలానికి లీజు మోక్షం లభిస్తుందేమో వేచిచూడాల్సి ఉంది. తెనాలిలో ఒకప్పుడు ఆర్టీసీ బస్‌స్టేషన్ పట్టణ నడిబొడ్డులో ఉండేది. పట్టణంలోని రైల్ ఓవర్ బ్రిడ్జి ఎక్కేటపుడు కుడిపక్కన ఉండే రణరంగచౌక్‌లోని అమరవీరుల స్థూపాలకు వెనుకవైపున బస్‌స్టేషను ఉండేది. తూర్పున పెట్రోలు బంక్, పడమరవైపున రైల్వేస్టేషను రోడ్డు హద్దులుగా ఉండేది. బస్‌స్టేషన్‌కు చెందిన ఆర్టీసీ బస్సులకు రామలింగేశ్వరపేటలో ఆర్టీసీ డిపో ఉండేది. నిర్ణీత సమయాల్లో ఆయా బస్సులు బస్‌స్టేషనుకు వస్తూ ప్రయాణీకులతో రాకపోకలు సాగిస్తుండేవి. ఆ తర్వాత పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సువిశాలమైన బస్‌స్టేషన్ ఆవశ్యకత ఏర్పడింది. పట్టణానికి ఉత్తరం వైపున ప్రస్తుత బస్‌స్టేషన్‌ను నిర్మించారు. బస్‌స్టేషన్‌తో పాటు ఇక్కడే గ్యారేజీని కూడా నిర్మించటంతో ప్రత్యేకంగా డిపో అవసరం లేకుండాపోయింది. రామలింగేశ్వరపేటలోని ఆర్టీసీ బస్ డిపో స్థలం ఖాళీ అయింది. అప్పట్నుంచి అంటే దాదాపు 48 ఏళ్లుగా ఆ స్థలం నిరుపయోగంగా ఉండిపోయింది.



గోడకు అంటించిన లీజు టెండర్ల ప్రచార ఫ్లెక్సీ

దశాబ్దాలుగా ఖాళీగానే..

నష్టాల బాటలోని ఆర్టీసీ ఖాళీస్థలాలను లీజుకిస్తూ ఆదాయాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషను దగ్గరి ఖాళీస్థలాలను లీజుకిచ్చింది. రామలింగేశ్వరపేటలోని పాత డిపో స్థలాన్ని ఇప్పటివరకు లీజుకివ్వలేదు. ఆ స్థలం విస్తీర్ణం 3.80 ఎకరాలు. చుట్టూ నివాస భవనాలు ఏర్పాటైన ఆ ప్రదేశంలో గజం స్థలం విలువ రూ.40 వేలుంది. ఆ ప్రకారం లెక్కిస్తే స్థలం విలువ దాదాపు రూ.80 కోట్లు ఉంటుంది. అయినా ఇన్ని దశాబ్దాలుగా అది ఖాళీగానే ఉండిపోయింది. లీజుకిస్తే వచ్చే ఆదాయాన్ని ఆర్టీసీ నష్టపోయినట్టే! రెండేళ్లకో మూడేళ్లకో ఒకసారి వేసవిలో ఎగ్జిబిషన్‌కు అద్దెకిస్తున్నారు. ఎగ్జిబిషను నడిచినపుడు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. ప్రస్తుతం కూడా ఇక్కడ ఎగ్జిబిషను నిర్వహిస్తున్నారు.

అంత మొత్తం గిట్టుబాటు కాదనే..

విలువైన పాత డిపో స్థలాన్ని లీజుకిచ్చేందుకు ఆర్టీసీ అధికారులు ఎన్నిసార్లు ప్రయత్నించినా సాధ్యంపడలేదు. అద్దె మొత్తానికి, వచ్చే ఆదాయానికి బేరీజు వేసుకున్న వ్యాపారులు/ పారిశ్రామికవేత్తలు ముందుకు రాకపోవటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఆర్టీసీ నిబంధనల ప్రకారం స్థలం విలువలో కనీసం రూ.0.2 శాతం అద్దె నెలనెలా రావాల్సి వుంది. అంటే డిపో స్థలానికి నెలకు రూ.5–6 లక్షలు అద్దె ఖరారు కావాల్సివుంది. అంత మొత్తం అద్దె రావాలంటే ఆ ఏరియాలో కష్టమన్న భావన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా ఉన్న వ్యాపారి మాలేపాటి హరిప్రసాద్ గతంలో నెలకు రూ.2.60 లక్షల చొప్పున లీజు చెల్లిస్తానని ప్రతిపాదించారు. అయినా నిబంధనలు అంగీకరించవని ఆర్టీసీ అధికారులు నిరాకరించారు. దీనితో ఇప్పుడు అదే 3.80 ఎకరాల స్థలాన్ని రెండు భాగాలుగా విభజించి మళ్లీ లీజు టెండర్లను ఆర్టీసీ ప్రకటించింది. యూనిట్–1 కింద 7,260 గజాలు, యూనిట్–2 కింద 7,260 గజాలుగా విభజన చేశారు. ఒక్కో దానికి వేర్వేరుగా టెండర్లను ఆహ్వానించారు. లీజు కాలపరిమితిని 15 ఏళ్లుగా నిర్ణయించారు. ఈనెల 29వ తేదీ టెండర్ల దాఖలుకు తుది గడువుగా ప్రకటించారు. సదరు ప్రకటన ఫ్లెక్సీని పాతడిపో స్థలానికి ముందువైపున్న గోడకు తగిలించారు. ఈసారైనా టెండర్లు దాఖలై లీజు ఖరారవుతుందేమో చూడాల్సివుంది.

జీవన విధానంలో మార్పులు రావాలి



రక్త పరీక్షలు చేయించుకుంటున్న వాకర్స్

తెనాలిఅర్బన్: వ్యక్తిగత జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని డాక్టర్ అమర్‌నాథ్ పేర్కొన్నారు. చినరావూరు పార్కు వాకర్స్ అసోసియేషన్ తెనాలి అధ్యక్షులు, 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత రక్తపరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం కలుషితంగా ఉంటుందని చెప్పారు. దీనివలన అనేక వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. కనీసం మూడు నెలలకు ఒకసారి వివిధ రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కౌన్సిలర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా చివరి ఆదివారం మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 70 మంది వాకర్స్‌కు వివిధ రకాల రక్తపరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు, కోశాధికారి బి.నరసింహారావు, సుబ్బారెడ్డి, అద్దేపల్లి సాంబశివరావు, గంజి ప్రభాకరరావు, ఓంకార ప్రసాద్, సుభశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్టా ఆవిర్భావ దినోత్సవం

తెనాలిటౌన్: కళను ప్రజల కోసం, ప్రజా ప్రయోజనాల కోసం ప్రదర్శించాలన్నా దృఢ సంకల్పంతో ఆవిర్భవించిన సంస్థ ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇఫ్టా) అసోసియేషన్ అని ఉపాధ్యాయ రాష్ట్ర అవార్డు గ్రహీత ఎంవీ రఘునాథరావు పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కాఫ్ కార్యాలయంలో ఆదివారం ప్రజా నాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇఫ్టా ఆవిర్భావ సభ, విప్లవ సినీ నటుడు మాదాల రంగారావు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, నీలాంబరం, బేబి, నాగేశ్వరరావు, నాగమణి, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రభాత్, చందు పాల్గొన్నారు.

అలరించిన గానామృతం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి కొత్తపేటలోని అదితి గ్రాండ్ ఫంక్షన్‌హాలులో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతిని నిర్వహించారు. సంకీర్తన వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు ఆధ్వర్యంలో గాయనీగాయకులతో అన్నమయ్య కీర్తనలను భక్తిపారవశ్యంతో ఆలపించారు. డాక్టర్ పురుషోత్తమరావు అన్నమయ్య కీర్తనలను గానం చేసి, ఆహూతుల అభినందనలు అందుకున్నారు. వీరికి వయోలిన్‌పై గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, కీబోర్డుపై నూతక్కి వెంకటేశ్వరరావు, మృదంగంపై కానూరి వెంకట రామకృష్ణ, తబలాపై పెరవలి వంశీకృష్ణ వాయిద్య సహకారం అందించారు. దాదాపు రెండు గంటలసేపు అన్నమయ్య కీర్తనల గానామృతంతో సంగీతాభిమానులను రంజింపజేశారు. సంస్థ కార్యదర్శి కె.రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

సినిమాకు పరిశ్రమ హోదా కల్పించడం హర్షణీయం

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలిఅర్బన్: సినిమాకు పరిశ్రమ హోదా కల్పిస్తూ కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్‌మెంట్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం వలన ఎంతో మేలు జరిగే అవకాశం ఉందని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి ఎగ్జిబిటర్లు తలపెట్టిన సినిమా థియేటర్‌ల బంద్‌ను ఉపసంహరించుకోవడం హర్షణీయమన్నారు. సినిమా థియేటర్ల యాజమానుల ప్రమేయం లేకుండా లీజుకు తీసుకున్న ఆరుగురు ప్రముఖులు దీనివెనుక ఉన్నారనే ఆరోపణ చేశారు. ఇకపై ఎవరితోనూ వ్యక్తిగత సంప్రదింపులు లేకుండా సినిమా సంఘాలతో చర్చలు జరుపుతామని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రకటించడం శుభపరిణామన్నారు. సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్, వేమూరు విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

తెనాలి: కళాసాహిత్యాల అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలిలో చారిత్రాత్మక నాటకం 'జయహో శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్' ప్రదర్శించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఆదివారం రాత్రి ప్రదర్శించిన ఈ చారిత్రక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్యవేదిక, సంయుక్తంగా ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు. విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయిబాబా నాట్యమండలి కళాకారులు 60 మంది నటులు పాత్రోచితంగా నటించారు. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ రచించిన నాటకాన్ని ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అధినేత చలసాని బలరామయ్య ప్రదర్శనా సహకారం అందించారు. తొలిసారిగా డిజిటల్ టెక్నాలజీతో ప్రదర్శించటం మరో విశేషం. ప్రారంభ కార్యక్రమంలో శివాజీ స్మారక సమితి గౌరవాధ్యక్షుడు డీఎల్ కాంతారావు, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, బీజేపీ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు తదితరులు పాల్గొన్నారు. జూన్ 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు తెనాలిలో శోభాయాత్రను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జనసమీకరణకు ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకంలో సన్నివేశం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తెనాలిటౌన్: కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు సూచించారు. ఆదివారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోవిడ్ మహమ్మారి దేశ వ్యాప్తంగా కోరలు చాస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం అప్రమత్తమే ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ, మండల గ్రామాల్లో కోవిడ్ కిట్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు.

31న శ్రీపార్వతీ సమేత ఓంకారేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ట



ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఓంకారాశ్రమం ప్రాంగణంలో నిర్మించిన పరివార దేవతా, శిఖర, ధ్వజస్తంభ, శ్రీశరభ సాళ్వేశ్వరస్వామి, శ్రీపార్వతీ సమేత శ్రీఓంకారేశ్వరస్వామి వార్ల ప్రతిష్టా మహోత్సవం ఈనెల 31వ తేదీ ఉదయం 8.19 గంటలకు జరగనుంది. శ్రీఅవధూత వద్ద పీఠ ఆస్థాన విద్వాన్ బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ శివాచార్య ఆధ్వర్యంలో శైవాగమ సంప్రదాయ పద్ధతిలో త్రయాహ్నిక దీక్షతో జరుపనున్నారు. ఆదివారం ఆలయం వద్ద సంబంధిత ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రతిష్టా మహోత్సవంలో గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కామినేని బసవశ్రీనివాసరావు పాల్గొంటారు. ఆధ్యాత్మిక ప్రముఖులైన తాళ్లాయపాలెం శైవపీఠాధిపతి శ్రీశివస్వామి, రుద్రప్రయాగ, ఉత్తరాఖండ్ నుంచి సంతు సదానంద్ గిరి బాబా, సంతు సదానంద, ఒంగోలు గౌరవాధ్యక్షురాలు శ్రీమహావిద్యానందగిరి మాతాజీ మాజరవుతారని ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రతిష్టా మహోత్సవాలు 29 నుండి ఆరంభిస్తున్నట్లు తెలిపారు. 31వ తేదీన పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రూప్–2 దేవాలయాల కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్, సహస్ర ప్రతిష్ఠాపకులు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్, దేశబోయిన మహేశ్వరరావు, గోపిశెట్టి నాగేశ్వరరావు, ఆదెన కృష్ణ, తాడిబోయిన అనిల్, తాడిబోయిన గోపి, అర్చకుడు స్వర్ణ వెంకట నాగకుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధురాలి ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో చోరీపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 88 ఏళ్ల పాలడుగు కృష్ణకుమారి కుమార్తె, కుమారుడికి వివాహాలు అయి వేరుగా ఉండడం, ప్రభుత్వోపాధ్యాయుడిగా పని చేసి రిటైరైన భర్త గతంలో మృతి చెందడంతో ఇక్కడి ఓ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసిస్తోంది. ఇటీవల తన కుమార్తెకు ఉన్న పొంతంకు సంబంధించిన కౌలు డబ్బులు రూ. 98 వేలు, తనకు వచ్చే భర్త పింఛన్ నగదును ఇంట్లో ఉంచింది. శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాను ఓ సబ్బుల కంపెనీ ప్రతినిధినని, శాంపిల్ సబ్బులను అందరికీ ఇస్తున్నామని చెప్పి మాటలు కలిపాడు. ఇంతలో పాలు పొంగుతుండడంతో కిచెన్‌లోనికి కృష్ణకుమారి వెళ్లి రాగా సదరు వ్యక్తి కనబడకుండాపోయాడు. కొద్ది సేపటి తర్వాత అనుమానం వచ్చి ఇంట్లోని షెల్ఫ్‌లో చూడగా తాను ఉంచిన నగదు లేదు. దీంతో తన బంధువైన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఇతర బంధువులకు బాధితురాలు విషయాన్ని తెలిపారు. శివకుమార్ తన అనుచరులను ఆమె వద్దకు పంపి ఆమె ద్వారా డయల్ 112కు ఫోన్ చేయించారు. టూ టౌన్ పోలీసులు వృద్ధురాలి ఫ్లాట్ వద్దకు వెళ్లి పరిశీలించి ఆమె వద్ద ఫిర్యాదు తీసుకుని రాత్రికి కేసు నమోదు చేశారు.

ఆరాధ్యుల సేవలు అభినందనీయం

తెనాలిటౌన్: పౌరాణిక నాటకాలకు సంబంధించి కళాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఆరాధ్యుల ఆదినారాయణ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బాలాజీరావుపేటలోని కార్యాలయంలో ఆరాధ్యుల ఆదినారాయణను దుశ్శాలువా, మెమోంటోతో కళాకారులు ఘనంగా సత్కరించారు. ఇటీవల రూరల్ మండలం కఠెవరం గ్రామంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాల్లో ప్రదర్శించిన పౌరాణిక నాటకాలకు సంబంధించి పలువురు కొత్త కళాకారులకు ఆయన విద్య నేర్పినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ ఫణికుమార్ చౌదరి, నాయుడు గోపి, సాంబశివరావు, తాడిబోయిన నాగేశ్వరరావు, ఎం.కుమార్‌బాబు, కృష్ణారావు, ఎ.అశోక్‌కుమార్, రామలింగేశ్వరరావు, బ్రహ్మాజీ, శంకరరావు, చంద్రమౌళి, చందు సూర్య, మున్నంగి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

'సింహామంటి చిన్నోడు' విజయోత్సవ సభ



గంపల శివనాగేశ్వరరావును సత్కరిస్తున్న నటీనటులు

తెనాలిటౌన్: సమకాలీన రాజకీయాలకు అద్దం పట్టేలా సింహామంటి చిన్నోడు సాంఘిక నాటకం ప్రదర్శించినట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, కఠెవరం గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆటోనగర్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం సింహామంటి చిన్నోడు సాంఘిక నాటక విజయోత్సవ సభ నిర్వహించారు. గంపల శివనాగేశ్వరరావు నటించి, దర్శకత్వం వహించిన నాటకం మండలంలోని ప్రజల మన్ననలు పొందిందని సీనియర్ నటుడు బెల్లంకొండ వెంకట్ కొనియాడారు. ఈ సందర్భంగా గంపల శివనాగేశ్వరరావును దుశ్శాలువా, పూలమాలలతో నాటకంలోని నటీనటులు సత్కరించారు. గంపల శివనాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం అహర్నిశలు శ్రమించే కథానాయకుడి ఇతివృత్తాన్ని సాంఘిక నాటకరూపంలో తెరకెక్కించినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం తన వద్ద ఉన్న ధనం మొత్తం ఖర్చుపెట్టి ప్రజలమెప్పు పొందిన వైనాన్ని ఇతివృత్తంగా చూపించినట్లు చెప్పారు. రామరాజు, కత్తుల శ్రీను, ఆర్.అశోక్‌రాజు, లక్ష్మణ్‌రాజు, లక్కరాజు బాబ్జి, కొండం రాజు, పసుపులేటి శ్రీను, అంకమరావు, మేకల శివరామయ్య, గంపల చిట్టిబాబు, సుబ్బారావు, వర్మ, మంచాల శ్రీను, షేక్ బడే, పోకల రమేష్, తదితరులు ఉన్నారు.

యోగాతో ఎన్నో ఉపయోగాలు

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



యోగా శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏసీ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: యోగా చేయడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నార్త్ ఇండియాకు చెందిన కొందరూ శిక్షకులు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్వో రాంప్రసాద్, పలువురు మున్సిపల్ అధికారులు, యోగసాధకులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



తెనాలిటౌన్: యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న కేసీఎల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. తెనాలిలో గత 10 సంవత్సరాలుగా కావేటి యలమందరావు స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి యువతను అందులో భాగస్వాములు చేయడం అభినందనీయమని కొనియాడారు. విజేతలకు మెమోంటో బహూకరించారు. అమిరినేని రాజా, కావేటి వేణుగోపాల్, కోలా అశోక్, పాశం వెంకటేష్, మణికంఠ, సుమన్, నరసింహా, కోలా వాసు, రాజేష్, సాంబయ్య, రామారావు, వేణు, తదితరులు ఉన్నారు.

కాల్వ శుభ్రం.. వంతెన నాశనం



ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద తూర్పుకాల్వలో వ్యర్థాల తొలగింపు



బస్‌స్టేషన్ వంతెనపై వేసిన వ్యర్థాలు, రోడ్డుపై మురుగు

కృష్ణా పశ్చిమ డెల్టాలోని పంటకాల్వలకు సాగునీరు విడుదలకు తరుణం దగ్గరవుతున్నా, కాల్వల మరమ్మతులు, తూటాకు, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవటం లేదంటూ ఇటీవల 'సాక్షి'లో వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణం నుంచి ప్రవహిస్తుండే తూర్పు కాల్వలో తూటాకు, గుర్రపుడెక్కను ఆదివారం తొలగిస్తున్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషను సమీపంలో ఈ పనులు జరుగుతున్నాయి. ఇంతవరకూ బాగానేవున్నా, కాల్వలోంచి తీసిన వ్యర్థాలను తూర్పుకాల్వపై గల ఆర్టీసీ బస్టాండ్ వంతెనపై పోస్తుండటం చిత్రంగా ఉంది. వ్యర్థాలతోపాటు మురుగునీరు కూడా వస్తోంది. మురుగునీరు వంతెన మొత్తం ఆక్రమించింది. కాల్వ బాగు చేస్తూ, ఆర్టీసీ బస్సులతో సహా ఆటోలు, ద్విచక్ర వాహనాలు నడుస్తుండే వంతెనను పాడుచేస్తున్నారేమిటి? అని స్థానికులు విమర్శిస్తున్నారు. – తెనాలి